ఫారిన్ మొగుళ్ళు

వేములపల్లి మోహన్‌రావు

A NIKETANAM
VET ALEM

దుబాయ్ కార్ల్‌టన్ టవర్‌లో ఆ సాయంత్రం పార్టీ మాకు. మర్నాడే జార్జ్ జెనీవా వెళ్ళిపోతున్నాడు ఫ్యామిలీతో సహా. అతనికి సెండాఫ్ ఇస్తున్నాం మిత్రులమంతా. అంతా కలిసి పదిమంది కన్నా ఎక్కువ లేం. ఆ పదిమందిలో నలుగుర్ని చుట్టూ చేర్చుకుని ధారాళంగా ఉపన్యసించేస్తున్నాడు మా నానీ. వినే వాళ్ళుంటే గంటలకొద్దీ హరికథలు చెప్పడం వాడిలోని గొప్ప ఆర్టు. నాకు తెలుసు, ఆ పార్టీ అయిపోయేసరికి వాడు కనీసం రెండుమూడు ఆర్డర్లైనా పట్టేస్తాడు. నాకు ఏకాంతం ఇష్టం. దూరంగా కనబడుతున్న ఫ్లోటింగ్ హోటల్ పైన గాలికి ఉయ్యాలలూగే దీపాల తోరణాల్ని తదేకంగా చూస్తున్నాను.

'ఏమిటి ఒక్కడివే నిల్చున్నావ్. నీ గ్లాసేదీ?' అడిగింది మిసెస్ జార్జ్.

'నో. నో. నేను తాగను' అన్నాను స్థిరంగా.

'వాట్?' ఆ గొంతులో ఆశ్చర్యానికర్థం వీడు మనిషా మృగమా అని.

'ఇంతకు ముందెప్పుడూ తాగలేదా?'

'పెళ్ళికి ముందు తాగేవాణ్ణి. తర్వాత మానేశాను.'

ఆమె కళ్ళలో ఆసక్తి తొంగి చూసింది.

'ఎందుకని? మీ ఆవిడ వద్దందా?' అవునన్నట్టు తలూపాను.

'అయితే మీ మిసెస్ ఏం చెప్తే అది చేస్తావా?'

ఏ మొగుడూ నేను హెన్‌పెక్డ్ అని చెప్పుకోడు. కానీ సంభాషణను అంతకు మించి పొడిగించడం నాకిష్టంలేక నాకా పరిస్థితి కొంచెం ఇబ్బందిగా ఉండి, తల ఊపాను.

'హేయ్ జార్జ్ 'కమియర్' అందామె. జార్జ్ దగ్గరగా వచ్చాడు.

'ఇతన్ని చూడు. భార్య తాగవద్దందని మానేశాడు. ఏ విషయంలోనైనా పెళ్ళాం

మాట జవదాటడు. నువ్వూ ఉన్నావ్ ఎందుకూ !'

అతనామె మాటలను పట్టించుకోనట్టు నావైపు తిరిగి అన్నాడు.

'ఎప్పుడొస్తోంది మీ మిసెస్ ?'

'ఇప్పుడెక్కడ ! రేపో ఎల్లుండో డ్యూ. డిసెంబర్‌లో వస్తుందేమో ?' అన్నాను.

'వాట్ ?' ప్రళయం వచ్చేసి ప్రపంచం మునిగిపోతున్నంత ఆశ్చర్య పడ్డారు ఇద్దరూ.

'అయితే నువ్వింకా ఇక్కడే వున్నావే' అన్నాడు జార్జ్.

'ఎప్పుడెళ్తున్నావ్ ?' అడిగిందామె.

నాకర్థం కాలేదు వాళ్ళ హడావిడి. 'ఎక్కడికి వెళ్ళేది ? ఊపిరి సలపనన్ని పనులున్నాయి యిక్కడ. వెళ్ళి ఏం చెయ్యను ? అయినా డెలివరీ తనకి గానీ నాక్కాదుగా. చాలామంది ఉన్నారక్కడ ఆమెను జాగ్రత్తగా చూసుకోవడానికి.'

దేశద్రోహిని నియంత చూసినట్టుగా చూశాడు జార్జ్.

'రబ్బిష్. నువ్వు లేకపోతే మీ షేక్ జాయెద్ రాజ్యం అల్లకల్లోలమైపోదు. పరిపాలన సక్రమంగానే సాగుతుంది. వ్యాపారాలూ, వృత్తులూ మూలపడి పోవు. అయినా నువ్వండి చేస్తున్న ఘనకార్యాలేమున్నాయి? ఒకవేళ ఉన్నా అవన్నీ చక్కబెట్టడానికి మీవాడు న్నాడుగా.... వెళ్ళు. వెళ్ళు. అక్కడ పెళ్లాం ప్రసవానికి సిద్ధంగా ఉంటే, షికారు కొచ్చిన రాజకుమారుడిలా పార్టీ కొచ్చాడు పెద్దమనిషి.'

'నో. నో. యూ మస్ట్ గో. ఒక స్త్రీగా ఆ అనుభవం ఎలాంటిదో నాకు తెలుసు. ఎంతమంది పక్కన ఉన్నా, ఆ టైంలో భర్త ఉన్న దారి వేరు, ఆ సంతృప్తి వేరు,' అంది మిసెస్ జార్జ్.

'నేనైతే మా నికోలస్ పుట్టినప్పుడు పదిరోజులు ఈమె బెడ్ పక్కనే ఉన్నాను. కావాలంటే అడుగు,' అని ఆమెవైపు చూశాడు జార్జి.

నేనేం మాట్లాడలేదు. మళ్ళీ తనే అన్నాడు నిష్ఠూరంగా.

'మీ ఇండియన్స్ పెళ్లాల్ని పువ్వుల్లో పెట్టుకుని చూస్తారని చెబుతోందిగా మీ చరిత్ర. పెళ్లికి మీరిచ్చే ప్రాధాన్యత, భార్యలకు మీరిచ్చే గౌరవం, అనురాగం, ఆప్యాయత ఏ సంఘంలోనూ లేదని అంటారు. కేవలం ప్రచారమేనన్న మాట.'

'దానికీ దీనికీ సంబంధమేముంది జార్జ్ ? మేము భార్యను ప్రేమగా చూసు కునే మాట వాస్తవమే. కానీ వేలమైళ్ళ దూరం ప్రయాణంచేసి ప్రసవ సమ యంలో తప్పనిసరిగా పక్కనే ఉండా లనుకోవడం ప్రాక్టికబుల్ కాదంటు న్నాను నేను.'

'ఏం ! ఎందుకాదు ! నేనే నీ స్థానంలో ఉంటే నెక్ట్స్ పాజిబుల్

ఫ్లైట్‌లో వెళ్ళిపోయేవాణ్ణి. అది ఎయిరిండియా అయినాసరే।

'ఎయిరిండియాలో మీకేం లోటు చేస్తున్నారు ? ఎటొచ్చీ ఇండియన్స్‌నే కుక్కల్లా చూస్తారుగానీ' మాట మార్చ డానికి ప్రయత్నించాను కానీ లాభం లేక పోయింది.

'ఎనీహౌ, నిన్నీ విషయంలో నేను సమర్థించలేను. యూ మస్ట్ బి దేర్. నీ భార్యతో నువ్వు అనుభవించిన ఆనందం ఫలించబోతుంటే దగ్గర ఉండి ఆ కష్ట సుఖాల్లో పాలు పంచుకోని నువ్వేం మనిషివి ? ప్రాణికోటిలో ఏ జంతువు నైనా తీసుకో. నీలా ఏదీ ప్రవర్తించదు, భావించదు ఈ విషయంలో.'

పెప్సీకోలా గ్లాస్‌లో పోసి నా కందిస్తూ అంది మిసెస్ జార్జి.

'వీళ్ళంతా పెద్ద హిపోక్రట్స్ జాజ్. మిగతా దేశాలకన్నా సాంస్కృతిక పరంగా, నాగరికపరంగా ఓ ఉన్నత మైన స్థానంలో వున్నామని గర్వపడ తారు. మా స్త్రీకి సంఘం ఇచ్చే రక్షణ, మిగతా జాతులు ఇవ్వలేవంటారు. మా వివాహాలకున్న స్థిరత్వం, శాశ్వతత్వం లోకానికే ఆదర్శం అని చాటుకుంటారు. మా ఆడపిల్లలు రేప్ చెయ్యబడక పోవ డానికీ, డ్రగ్ ఎడిక్ట్స్‌గా మారకపోవ డానికీ కారణం, మా సంఘం యొక్క ఔన్నత్యమే నంటారు. కానీ నన్నడిగితే ఇవన్నీ ఆ ఆడపిల్లల బానిసత్వానికి చిహ్నాలు. నిజానికి మానసికంగా చిత్ర హింస ననుభవించేది హిందూస్త్రీలే. ఆ హింసకు మూలం ఇలాంటి భర్తలే, బయట పదిమందితో భార్యంటే దేవత అని చెబుతారు. ఆ దేవత చావు బతు కుల్లో. ఉన్నా చూట్టానిక్కూడా వెళ్ళ నక్కర్లేదనుకుంటారు.'

తల దిమ్మెక్కిపోయింది నాకు. స్త్రీ స్వేచ్ఛకు నిర్వచనం, గంజాయీ, మత్తు మందులూ, పదిమంది పురుషుల చేతిలో నలగడం అని ఆమె భావిస్తోంది. అలా హిందూస్త్రీ ఉండటంలేదని వాపోతోంది. అందుక్కారణం, నాలాంటి వాళ్ళేనని దుమ్మెత్తిపోస్తోంది. ఏమైనా ఈ చర్చ ఇంతటితో ఆగకపోతే నాకు పిచ్చెక్కు తుంది.

'ఓ కే బాబా ! రేపు ఈవినింగ్ ఓ ఫ్లైట్ ఉందనుకుంటాను. దాంట్లో వెళ్తాను సరేనా !'

ఇద్దరి మొహాలూ వికసించాయి. జార్జ్ అన్నాడు.

'దట్స్ గూడ్. అలా వుండాలి. విష్ యూ ఆల్ ది బెస్ట్. మీ మిసెస్‌కు మా శుభాకాంక్షలందజెయ్యి।'

కానీ వాళ్ళకు తెలియదు, ఆ మర్నాడు సాయంత్రం అసలు ఫ్లైటే లేదనీ, ఉన్నా నేను వెళ్ళననీ, ఆర్గ్యుమెంట్ నా చెయ్యిదాటి పోతున్నప్పుడు అలాంటి చిన్న చిన్న అబద్ధాలు నాకు అక్కర కొచ్చే చుట్టాలనీ.



ఇంకా గెస్ట్స్ ఎవరో వస్తుంటే వాళ్ళను రిసీవ్ చేసుకోడానికి అటు వెళ్ళారు భార్యాభర్తలు. నేను తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

డిస్కోలోనుండి జలపాతంలా సంగీతం జారిపడుతోంది. బార్‌లో నుండి అప్పుడే బయటకు వస్తున్నాడు దామోదర్.

'హాయ్ యంగ్‌మాన్, ఎలా ఉన్నావ్' అంటూ ఆప్యాయంగా నా చెయ్యి అందుకున్నాడు. చాలా సామాన్యమైన వాటిని ఎంతో, ఇంటరెస్ట్ కలిగేలా చెప్పడం అతని ప్రత్యేకత. ఫ్లాట్ మార్చి విల్లా తీసుకున్నాడట. ఆ సంగతి అతని భార్యకు ఇంకా తెలియదట. ఎయిర్‌పోర్ట్‌నుంచీ తిన్నగా ఆ ఇంట్లోకి తీసుకుపోతాడుట. కొత్త ఫర్నిచర్, కొత్త కార్పెట్లు, కొత్త టీవీ, అంతా కొత్తగా ఉండటం చూసి అతని భార్య అమాంతం అతన్ని కౌగిలించుకుని మొహమంతా ముద్దుల్తో నింపేస్తుందట. ఏ విషయమైనా తనదగ్గర దాచలేడని ఆమెకెంతో గర్వమట. రెండు నెలల క్రితమే ఈ ఇంట్లోకి మారినా, తనకింతవరకూ ఈ సంగతి చెప్పలేదని పెద్ద షాక్ తింటుందట.

అప్పుడే అతనిభార్య అతన్ని

ముద్దుల్తో ముంచెత్తినట్టు మొహమంతా ఎర్రబడిపోయింది. కొంతమంది మాటల్ని, అభినయాన్ని చూడటాన్ని మించిన ఎంటర్టెయిన్మెంటు ఇంకోటి ఉండదు.

'మరి నే వెళ్ళొస్తాను' అన్నాడతను.

'అదేమిటి డిన్నర్కి ఉండు. గెస్ట్సని పరిచయం చేస్తాను. కమాన్' అన్నాను.

'నో. నో. చాలా ఇంపార్టెంట్ పని మీద వెళ్తున్నాను. ఇంకోసారెప్పుడైనా!'

'నా మామూలేదీ' అన్నాను నేనతని చేయి పట్టుకుని.

ఒకే ఒక్క క్షణం ఆలోచించాడతను.

'ఆ! వెనకటికో సర్దార్జీ రోడ్డుమీద వెళ్తున్న తన మిత్రుణ్ణి ఆపి, మొన్నీ మధ్య మీ ఇంట్లో ఎవరో చచ్చిపోయారని విన్నాను. నువ్వా, మీ తమ్ముడా ? అని అడిగాడట.'

నా నవ్వుకు ఆనకట్ట పడకముందే అతను వెళ్ళిపోయాడు.

డిన్నర్ పూర్తయి మేము హోటల్ బయటికి వచ్చేసరికి పన్నెండయింది.

'నేను వీళ్ళ కార్లో వస్తాను డియర్. నువ్వు పద,' అంది మిసెస్ జార్జ్.

'ఓకే' అన్నాడతను ఆమె దగ్గరగా వస్తూ. ఇద్దరూ ఆ నడిరోడ్డుమీద ముద్దు పెట్టుకున్నారు. అప్పుడామె నన్ను క్రీగంట చూడటం నేను గమనించక పోలేదు.

మా నానీ నడిగాను మెల్లగా. 'ఇదే మిత్రా, వీళ్ళు వీధిలో శృంగారాలు. ఎలాగూ ఇంటికే వెళ్తున్నారుగా, అంత లోనే ఇంత విరహమా!'

'అదంతేలే. నీకు తెలీదు' అన్నాడు అక్కడికి వాడికేదో తెలిసి చచ్చినట్టు.

అంతే మరి. జవాబు తెలియనివాడికి అడిగినవాడు లోకువ.

వాళ్ళకు 'బాన్వాయేజ్' చెప్పేసి తిరిగొస్తున్నాం.

'రాత్రికి ఇక్కడ పడుకుందామా, వెళ్ళిపోదామా' అన్నాడు నానీ.

'పోదాం రా. రెండు గంటలేగా' అన్నాను.

'నేను రెండు నిముషాలు కూడా డ్రైవ్ చేయలేను. నిద్ర ముంచుకొచ్చేస్తోంది' అన్నాడు ఆవులిస్తూ.

ఇద్దరం సీట్లు మారాం.

'అవునూ, ఇందాక పార్టీలో ఆ గ్రీన్ సూటతను ఎవర్రా! అతనొచ్చినదగ్గర్నుంచీ అబ్జర్వ్ చేశాను. ప్రపంచంలో సమస్తం పోగొట్టుకున్నవాడిలా, విషాదమంతా తన మొహంలోనే నింపుకుని కూర్చున్నాడు అంతసేపూ.'

'అతనిది పాకిస్తాన్. ఇక్కడే ఒక ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పేరు సరిగా గుర్తులేదు నాకు. రేపో ఎల్లుండో అతని భార్య, పిల్లలు వస్తున్నారు కరాచీ నుంచి. బహుశా వాళ్ళు గుర్తొచ్చారేమో!' అన్నాడు నానీ

వెనకసీట్లో వెల్లకిలా పడుకుని మరోసారి అవులిస్తూ.

'పెళ్లాం పిల్లలు వస్తుంటే ఏడుపు మొహం ఎందుకు?"

'ఒరేయ్! నీకు దొరికినట్టు అందరికీ, మా చెల్లెల్లాంటి నోరూ వాయిలేని పెళ్లాలు దొరుకుతార్రా! వీడి పెళ్ళాం వస్తే ఇప్పటివరకూ ఉన్న స్వాతంత్ర్యం ఊడిపోయి తన ఇల్లే చిన్న పాకిస్తాన్‌లా గందరగోళమైపోతుందని భయమేమో! ఇక నోరు మూసుకుని కారు తోలు.'

!అలాగే అర్జునా! ఇక నీవు శయనింపుము,' అని నే నన్న రెండు నిమిషాలకే వాడు మొదలుపెట్టిన గుర్రు కారుని దదదడలాడించసాగింది.

బెర్నార్డ్ సన్‌లే వాళ్ళు కడుతున్న ఇంటర్నేషనల్ ట్రేడ్ బిల్డింగ్ దగ్గర కొచ్చేసరికి పోలీసులు కారు ఆపేశారు.

నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. నాకు లైసెన్స్‌లేదు. ఒక జీవితకాలం పోయినా ఈ ఊళ్ళలో లైసెన్స్ రాదు. జైలు కెళ్ళడానికి సిద్ధపడిపోతూ కారాపాను. కానీ దిగలేదు. పోలీసు దగ్గరగా వచ్చాడు.

'లైసెన్స్?' అన్నాడు.

ఏంచెయ్యాలి? డాష్‌బోర్డు తెరిచి వెతుకుతున్నట్టు నటించసాగాను. రిజిస్ట్రేషన్ కార్డు దొరికింది. అది తీసిచ్చాను. చూసి తిరిగిచ్చేస్తూ మళ్ళీ 'లైసెన్స్ మౌజూద్' అన్నాడు.

తప్పదు. ఛాన్స్ తీసుకోవాలి. శ్రీకృష్ణ జన్మస్థానంలోకి వెళ్లి తీరిగ్గా ఆలోచించుకునేకంటే ఇక్కడ ఛాన్స్ తీసుకోవడమే వివేకం డాష్‌బోర్డులో ఉన్న మావాడి లైసెన్స్ తీసిచ్చాను. మొహం కనబడకుండా కొంచెం చీకట్లోకి లాక్కున్నాను లైసెన్స్ వేలిడిటీ మాత్రమే చూసినట్టున్నాడు. తిరిగి ఇచ్చేస్తూ 'అబూ ధాబీ?' అన్నాడు

అవునన్నట్టు తలూపాను.

'రో' అన్నాడు చెయ్యి ఊపుతూ.

బ్రతికిపోయిన జీవుణ్ణి అరిచేతిలో పట్టుకుని కారు స్టార్ట్ చేశాను. తప్పిపోయిన ప్రమాదంతో ఏం సంబంధం లేని మావాడు నిశ్చింతగా నిద్రపోతు న్నాడు

నూటఎనభై కిలోమీటర్ల ఈ ఎడారి దారి అంతులేని ఆలోచనలకు ఆస్కారమిస్తుంది అప్పుడప్పుడూ ఎదురొచ్చే ఒకటీ అరా కార్లు మినహాయించి, రోడ్డంతా నాకోసం పరిచిన మాయ జలతారులా మెరుస్తోంది, మార్జిన్ దాటి పక్కకు వెళ్తే 'దారి తప్పుతున్నావ్ సుమా' అన్నట్టు, తెల్లగా మెరుస్తూ, టైర్ల కింద పలు విచిత్రమైన చప్పుడు చేసే, రోడ్డు మధ్యలో పొదగబడిన క్యాట్ ఐస్. మూసేసిన అద్దాలలోంచి లోపలికి రావాలని విఫల ప్రయత్నం చేస్తూ ఈదురుగాలి. అది రోడ్డుమీదకు లాక్కొచ్చే ఇసుక కెరటాలు. కొంచెం

తలఎత్తి చూస్తే ఎడారికూడా వెన్నెల ఎందుకో అని బద్ధకిస్తున్న మసక చంద్రుడు, సానుభూతి సమ్మెచేస్తున్నట్టు, అతని పక్కన చుక్కలు.

జరిగిపోయిన యుద్ధంలో దారుణంగా చచ్చిపోయిన సైనికుల అస్థిపంజరాల్లా, యాక్సిడెంటై, రోడ్డుపక్కకు, ఎడారి లోకి ఈడ్చివేయబడి శిథిలమైపోయిన కార్ల అవశేషాలు. ఇసుకలోకి ఇంకి పోతూ కొన్ని, క్షతగాత్రుల్లా కొన్ని, నిమిషాన్ని పొదుపుచేయబోయి జీవితాల్ని ఖర్చుపెట్టుకోవద్దని హెచ్చరిస్తు.

దూరంగా ఒంటె రోడ్డు దాటుతోంది. బ్రేక్ తొక్కాను. నూటనలభై కిలో మీటర్ల వేగంతో వెళ్తున్న మెర్సిడెజ్ కిక్కురుమనకుండా ఇరవై మీదికి వచ్చే సింది. మావాడు మాత్రం ఢామ్మని సీటు మీదనుంచి కిందకు పడిపోయాడు.

'ఏమైందిరా' గట్టిగా అరిచేశాడు.

'ఒంటె' అన్నాను తాపీగా.

ఎమర్జెన్సీలో ప్రతిపక్షపు ఎంపీలా కిక్కురుమనకుండా మళ్ళీ సీటెక్కి పడుకున్నాడు. వాడే అని ఏమిటి. ఈ ప్రాంతంలో ఏ కారువాడికైనా దాని పేరు చెబితే హడల్. దాన్ని గుద్దేస్తే కారు పచ్చడి, ఒళ్ళు హూనం అవడం అటుంచి జీవిత శేషాన్ని జైల్లో గడప వలసి వస్తుంది. చట్టరీత్యా పగతీర్చుకో గల జంతువు అదొక్కటేనేమో.

మళ్ళీ కారు కదిలింది, మనసులో ఆలోచనల్లాగే ప్రేమ, పెళ్లి, మూన్నాళ్ళ ముచ్చట, విరహం, పిల్లలు అన్నీ ఒక్క సంవత్సరంలోనే. ఒక్క సారి వెనక్కు తిరిగి చూసుకుంటే అమూల్యమైనవాటిని ఎన్నిటినో పోగొట్టుకుంటున్నా మనిపిస్తుంది. ఒక్క డబ్బు మినహాయించి మరేదీ లేని ఈ ఎడారిలో ఎడారిలాంటి నిస్సారమైన జీవితం. అందమైన మాతృభూమి ఒళ్ళో తలదాచుకుందామంటే, ఈ ప్రకృతిని చూసి పరవశించు, అంతేకాని నువు అడిగినా ఏడ్చినా, అన్నం పెట్టలేను అని స్వదేశం ఇచ్చిన సందేశం. ఏ దారి నెన్నుకోవాలి నాలాంటి సామాన్యుడు?

మిసెస్ జార్జ్ మాటలు గుర్తొచ్చాయి. ఆమె చెప్పినట్టు ప్రపంచంలో అందరి. కన్నా అధమ స్థితిలో, అశాంతితో మానసిక వేదనతో క్రుంగిపోయేది భారతీయ వనితేనా? కాదు. కేవలం నా ఒక్కణ్ణి చూపించి వాళ్ళు దేశం మొత్తాన్నే జనరలైజ్ చేసేశారు. కానీ నిజంగానే నే నిప్పుడు ఇండియా వెళ్ళడానికి వీల్లేదు. అదివరకు బెజవాడలో కాలేజీ లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడైతే క్లాసుకు నలభై సమస్యలే. కానీ ఇక్కడికొచ్చి వ్యాపారంలో దిగాక అవి నాలుగొంద లయ్యాయి. ఎలా వొదిలిపెట్టి వెళ్ళేది?

ఆలోచనలను సశేషించి ఫ్లాట్ ముందు కారాపి మావాణ్ణి లేపాను. అర్ధరాత్రి రెండింటికి బాత్‌రూంలోకి



టవల్ భుజాన వేసుకుని ఎందుకు వెళ్తున్నానో అర్థంకాక మావాడు విచిత్రంగా చూశాడు. పెళ్లయిన బ్రహ్మచారిచేత జీవితం చేయించే సర్కస్‌లో ఓ చిన్న ఫీట్ ఈ నడిరేయి స్నానాలు. అలా షవర్ కింద నిలబడినప్పుడల్లా, వర్ధమాన రచయితలు గుండెలు బాదుకుని ఘోషించే విధవరాళ్ళ చరిత్రలు గుర్తొస్తాయి నాకు. మా మధ్య పెద్ద తేడా ఏం ఏడ్చి చచ్చింది!

ఎడారిలో పూలు పూయవు కవుల ఊహల్లో తప్ప పువ్వుల్ని తెచ్చి ఎడారిలో వేస్తే బ్రతకవు. మాడిపోతాయి. అందుకే వచ్చిన నెల తిరక్కుండా, బ్రతికుంటే బలుసాకు తింటాను అని మా ఆవిడ మళ్ళీ ఇండియా కెళ్ళిపోయింది, ఉత్తరాల్లో మీరొలకబోసే విరహకవిత్వం చాల్లే ఈ జన్మకి అంటూ. ఆవిడకు తోడు మా కూతురుకుంక ఒకటి. విమానం దిగడంతో మొదలెట్టిన ఏడుపు మళ్ళీ ఎయిర్‌హోస్టెస్‌ను చూసేవరకు ఆపలేదు.

ఆ తర్వాత రెండునెలల కనుకుంటాను

నేను స్విట్జర్లండ్ వెళ్ళవలసి వచ్చింది. టెలెక్స్ పంపిస్తే, ఎయిర్ పోర్ట్‌కు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు జార్జ్.

'ఎలా ఉన్నావు డియర్' అన్నాడు ఆప్యాయంగా కరచాలనం చేస్తూ.

'అయాం ఫైన్. నువ్వెలా ఉన్నావు. మీ నికోలస్. మీ మిసెస్ బాగున్నారా?' అడిగాను.

'ముందు నువ్వు కారెక్కు,' అంటూ ఏవేవో బిజినెస్ విషయాల్లోకి దింపేడు.

ఇంటికి చేరుకున్న తరువాత కూడా మా కెవరూ ఎదురురాలేదు. అంతా అస్తవ్యస్తంగా ఉంది. సోఫాల్లో చెల్లా చెదురుగా పడి ఉన్న విడిచిన బట్టల్ని పక్కకి నెడుతూ,

'కూర్చో' అన్నాడు జార్జ్.

ఎక్కడో, ఏదో పొరపాటు జరిగిందని నా మనసు చెబుతోంది. ఉండబట్ట లేక అడిగేశాను.

అ 'అర్ యూ ల్‌రైట్?'

'అఫ్‌కోర్స్. అయామ్ హండ్రెడ్ పర్సెంట్ అల్‌రైట్.'

డింపుల్ విస్కీని గ్లాసులోకి వంచుతూ అన్నాడతను. ఒకే బ్రాండ్ విస్కీ తాగేవాళ్ళను నేనెక్కడా చూడ లేదు. కానీ జార్జి డింపుల్ తప్ప ఇంకోటి ముట్టుకోడు.

'కొంచెం తీసుకుంటావా' అన్నాడు రెండో గ్లాస్ తీస్తూ

'నో నో అప్పటికీ ఇప్పటికీ నేనేం మారలేదు' అన్నాను.

నా కెందుకో ఆ సమావేశం వెలితిగా, అసంతృప్తిగా ఉంది.

'మీ ఆవిడ ఎక్కడ? నికోలస్ ఏదీ' మళ్ళీ అడిగాను.

'లేరు. ఇక్కడ ఉండటంలేదు. డైవర్స్ తీసుకున్నాం.'

ఐదునెలల క్రితం వాళ్ళిద్దరూ రోడ్డు మీద ముద్దుపెట్టుకుంటున్న సన్నివేశం నా కళ్ళముందు మెదిలింది.

'ఎందుకని?'

'జస్ట్ లైక్ దట్,'

'నో. నో. ఊరికే ఎవరూ వివాహాన్ని విచ్ఛిన్నం చేసుకోరు. సరదాకోసం జీవిత భాగస్వాముల్ని దూరంచేసుకోరు. బలీయమైన కారణాలు లేకుండా ఎవరూ మమతల్ని, అనుబంధాన్ని తెంచుకోరు,' కొంచెం ఉద్రేకంగా అన్నాను.

'కూల్ డౌన్ మై బాయ్. నువ్వు చెప్పేది ఇండియాలో. ఇక్కడ కాదు. ఈ సోషల్ ఎన్విరాన్‌మెంట్ వేరు మీ సాంఘిక జీవితానికి పూర్తిగా విభిన్నమైనది ఇది.'

'సామాజిక జీవనాల్లో వ్యత్యాసం ఉంటే ఉండవచ్చు. కానీ ప్రేమ, అనురాగం, ఆప్యాయత విశ్వజనీనమైనవి ఎంతో అన్యోన్యంగా ఉండే

మీరు కారణం. లేకుండా విడిపోవడమేమిటి?'

'కారణమంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఛేంజ్ కావాలనిపించింది మా ఇద్దరికీ. ఎల్లకాలం ఒకే పార్ట్‌నర్‌తో ఎలా కలిసివుండగలం చెప్పు.'

'ఎల్లకాలం ఒకే బ్రాండ్ విస్కీ, ఒకే బ్రాండ్ సిగరెట్లు మాత్రం కాల్చ గలవేం.'

'నేను నీతో వాదించలేను. ఆమెనే పిలుస్తాను. మీ రిద్దరూ తేల్చుకోండి. గొప్ప ఫ్రెండ్స్ గదా.'

ఫోన్‌చేసి నే నొచ్చాననీ, తనను చూడాలంటున్నాననీ చెప్పాడు. సాయంత్రం అయిదింటికి వస్తానందామె. అన్న టైంకి సరిగ్గా వచ్చింది. సోఫాలో నా పక్కనే కూర్చుంటూ అంది.

'కొంచెం లావెక్కావ్ మాన్. మీ ఆవిడెలా వుంది. ఇంతకీ మగపిల్లవాడా, ఆడపిల్లా.'

చెప్పాను.

నా కాశ్చర్యం వేస్తోంది వాళ్ళిద్దర్నీ చూస్తుంటే. అసలేమీ జరగనట్టే ఉన్నారు. ఆమె ఎవరో ఆర్కిటెక్ట్‌ను పెళ్ళిచేసుకుందట. జార్జికి వచ్చే నెలలో ఎవరో స్టెనోతో పెళ్ళట.

'మనం ఎందుకు విడిపోయామో కారణం తెలియాలట తనకి. నేను చెబితే నమ్మడంలేదు,' అన్నాడు జార్జి.

'ఏముంది? రొటీన్‌గా, ఏమాత్రం మార్పులేకుండా సాగిపోయే జీవితంలో థ్రిల్ ఏముంది? అందుకే కొంత వైవిధ్యం కావాలనుకున్నాం ఇద్దరం. దట్సాల్. యూ సీ. మీ దేశంలోలాగా నచ్చినా నచ్చకపోయినా, చచ్చేవరకు ఒకర్నే అంటిపెట్టుకుని ఉండాలని శాసించదు మా సంఘం. జీవితమనేది కేవలం అనుభవించడానికే. దానికి బలవంతాన పెళ్ళిపేరిట ఉరి బిగించి నరకం చేసుకోలేము. అందుకే మేం చాలా లక్కీ ఈ విషయంలో.

'ఏమో తల్లీ. ఎంతో వెనకబడిన వాళ్ళుగా మేం భావించే మా కొండ జాతుల్లోనూ ఇంతే. ఎంతో ప్రగతిని సాధిస్తున్నారనుకున్న మీలోనూ అంతే. అయితే మనలో ఎవరదృష్టవంతులనేది భగవంతుడికే తెలియాలి. కానీ ఒకటి. ప్రతి రాత్రీ భర్త పక్కన పడుకోబోయే ముందు 'ఈ మొగుడొదిలేస్తే రేపెలా' అని ఆలోచించవలసిన అవసరం మా స్త్రీకి లేదు. ఆ రకంగా ఆమె చాలా అదృష్టవంతురాలు. వస్తాను. ఏడింటికి ఎపాయింట్‌మెంట్ ఉంది.' బయటపడి ఊపిరి పీల్చుకున్నాను.